క్లుప్తంగా

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఆత్మకూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇందిరమ్మ సర్వేలో ఆన్‌లైన్ తప్పిదాలు జరిగినప్పటికీ ఇంతవరకు మళ్లీ సవరించలేదని పేర్కొన్నారు. ఇళ్లు లేక కిరాయి ఉంటున్నవారి దరఖాస్తుదారులు కూడా పెండింగ్‌లో పెట్టడం సరికాదని తెలిపారు. అన్ని దరఖాస్తులను పున:పరిశీలించి లబ్ధిదారులందరికీ న్యాయం చేయాలని కోరారు. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో అర్హుల తరఫున పోరాటాలు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు ధ్యానోత్సవం

ఆత్మకూరు: మండలకేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) ధ్యానోత్సవం నిర్వహించనున్నట్లు కన్వీనర్ టింగిలికారి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులపాటు సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు ధ్యానం అభ్యాసం చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

శాయంపేట: మండలంలోని గట్లకానిపర్తి, తహరాపూర్, కొత్తగట్టు సింగారం, పెద్దకోడెపాక, జోగంపల్లి, మైలారం, శాయంపేట, పత్తిపాక, నేరేడుపల్లి, గంగిరేణిగూడెం, వసంతాపూర్, కొప్పుల గ్రామాల్లో నేడు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించనున్నారు. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాలకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కళాకారుల ఫోరం జిల్లా కోకన్వీనర్‌గా భాస్కర్

మడికొండ: కళాకారుల ఫోరం హనుమకొండ జిల్లా కోకన్వీనర్‌గా కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన కొలిపాక భాస్కర్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ కళాకారులకు అండగా ఉంటానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వెన్నమల్ల వెంకటేష్, గడ్డం సుధాకర్, పాలేటి రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

గంట వ్యవధిలో అప్పగించారు



హసన్‌పర్తి: ఆటోలో పోగొట్టుకున్న బ్యాగ్‌ను గంట వ్యవధిలోనే బాధితురాలికి పోలీసులు అప్పగించిన సంఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నగరానికి చెందిన నూనావత్ శారద ఆదివారం భీమారం బస్టాండ్ వద్ద ఆటో ఎక్కి కేయూసీ క్రాస్ వద్ద దిగింది. దిగినప్పుడు ఆమె తన బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయింది. అనంతరం ఈ విషయాన్ని కేయూసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే అప్రమత్తమైన పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, ఏఎస్సై లియాఖత్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, మహిళా కానిస్టేబుళ్లు లహరి, మానస రంగంలోకి దిగారు. గంటలోనే ఆ ఆటోను గుర్తించి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ బ్యాగ్‌లో అర్ధ తులం బంగారు రింగు, అర్ధ తులం కమ్మలతో పాటు రూ.800 ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. అనంతరం బాధితురాలికి బ్యాగ్‌ను అప్పగించారు.

సీఎంఆర్‌లో రైస్ మిల్లర్ల దోపిడీ

ఖిలా వరంగల్: నామమాత్రపు చర్యలతో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందని, సీఎంఆర్‌లో రైస్ మిల్లర్లు కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన వ్యవహారంపై సీబీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని సమాఖ్య ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యాలయంలో హైకోర్టు న్యాయవాది మురారిశెట్టి యశ్వంత్ కుమార్ అధ్యక్షతన న్యాయ సలహా సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా సుదర్శన్ మాట్లాడుతూ వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల రైస్ మిల్లుల వ్యవహారం, అధికార యంత్రాంగం తీరుపై ఈనెల 25న ఢిల్లీలోని సీబీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రంగరాజు ఆనందరావు, రాయబారపు భిక్షపతి, బండి అనిల్‌కుమార్, మృదుల, చిలువేరు ప్రవీణ్‌కుమార్, రాజేష్, భార్గవ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సాగు.. లాభాలు బాగు



చింతలపల్లిలో సాగు చేసిన పొగాకు పంట



ఎండబెట్టేందుకు పొగాకును తాడుకు గుచ్చుతున్న కూలీలు

- పంట సాగుపై రైతుల ఆసక్తి
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి
- భీమదేవరపల్లి మండలంలో 53ఎకరాలు..
- ఎల్కతుర్తి మండలంలో 20ఎకరాల్లో సాగు

ఎల్కతుర్తి: వాణిజ్య పంటల్లో ఒకటైన పొగాకు సాగు వైపు రైతులు దృష్టి సారించారు. తక్కువ ఎరువులు, తక్కువ కాలం పంట కావడంతో రైతులు రబీ సీజన్‌లో పొగాకు పంట సాగు చేస్తున్నారు. గతంలో కొందరు రైతులు పొగాకు సాగు చేసి సంప్రదాయ పంటలకంటే అధిక దిగుబడి పొందడంతో ప్రస్తుతం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని రైతులు పొగాకు సాగుపై మక్కువ కనబర్చుతున్నారు. ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి, దామెర, ఇందిరానగర్, భీమదేవరపల్లి మండలంలోని వంగర, భీమదేవరపల్లి, గట్లనర్సింగాపూర్, ముత్తారం, గొల్లపల్లి, ముస్తాఫాపూర్, చంటయ్యపల్లి, కొత్తకొండ, ధర్మారం, మల్లారం, వీర్లగండ తండా, రసూల్‌పల్లి, బొల్లోనిపల్లి, రాంనగర్, రంగయ్యపల్లి, మాణిక్యాపూర్, విశ్వనాథకాలనీ, కొప్పూర్, రత్నగిరి, గాంధీనగర్, కొత్తపల్లి గ్రామాల్లో ఎక్కువగా రైతులు పొగాకు పంట సాగు చేసి లాభాలను అర్జిస్తున్నారు. ఎల్కతుర్తి మండలంలో సుమారు 20 ఎకరాల్లో పంట సాగు చేయగా భీమదేవరపల్లి మండలంలో 53 ఎకరాల్లో పొగాకు పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. పొగాకు పంటకు ఎలాంటి చీడ పీడలు సోకకపోవడంతో పురుగు మందుల బెడద లేదని కొద్దిపాటి నత్రజని, పొటాషియం ఎరువులతో పంట చేతికొస్తుందని రైతులు అంటున్నారు. అరుతడి పంట కావడంతో తక్కువ నీటితో సాగవుతుందని డ్రిప్ విధానంతో సాగు చేస్తే



ఆరబెట్టిన పొగాకు

మొక్కలు ఏపుగా పెరిగి అధిక ఆకులు వస్తాయని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 7 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, క్వింటాకు రూ.10 వేల నుంచి రూ.11వేలు ధర ఉంటుందని రైతులు తెలిపారు. ఖర్చులు పోను ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు. ఈ ఏడాది పంటలో కొంత లద్దెపురుగు ఆశిస్తుందని రైతులు తెలిపారు.

సాగు ఖర్చు తక్కువ..



నారు పోసిన తర్వాత కొద్దిపాటి రసాయన ఎరువులు, చల్లితే చాలు ఎలాంటి పురుగు మందులు అవసరం లేకుండానే పంట చేతికొస్తుంది. రైతులకు కేవలం దున్నిన కూలీల ఖర్చు, ఎరువుల ఖర్చు మాత్రమే ఉంటుంది. తక్కువ పెట్టుబడితో పంట చేతికందుతుంది. తక్కువ కాలం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి నాణ్యత కలిగి ఉండడంతో ఆశించిన ధర వచ్చే అవకాశం ఉంది. నేను ఎకరంలో పొగాకు పంట సాగు చేశారు.

– రమేష్, రైతు చింతలపల్లి

లద్దెపురుగు నివారణకు జాగ్రత్తలు..

పొగాకు పంటలో లద్దెపురుగు ఆశిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎల్కతుర్తి వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ వివరించారు.

- నొవల్‌యురాన్‌ను ఎకరాకు 400ఎంఎల్ 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- ఎమామెగ్టీ బెంజాయిట్‌ను ఎకరానికి 120గ్రాములు, లేదా.. టెయోడి కార్గో మందు 500 ఎంఎల్ 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- విషపు ఎర మోనోక్రోటోపాస్ అర లీటర్ నీటిలో కలుపడంతోపాటు 2కిలోల బెల్లం, 10కిలోల తౌడులో కలిపి రాత్రంతా నానబెట్టి తెల్లవారుజామున ఉండలుగా చేసి చెట్ల మొదట వేయడం వల్ల లద్దెపురుగు తిని నశిస్తుంది.

నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

- పంటలను పరిశీలించిన సీపీఐ నాయకులు



ఎండుతున్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి: దేవాదుల నార్త్ కెనాల్ నీరందక ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో ఎండిపోతున్న మొక్కజొన్న, వరి పంటలను సీపీఐ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు మాట్లాడుతూ.. గోపాల్‌పూర్‌కు చెందిన కర్రె రాజు తన ఎకరం పొలంలో వరిసాగు చేశారు. రుద్రారపు బాబు రెండు ఎకరాల 20గుంటల్లో మొక్కజొన్న సాగు చేయగా మెట్ట ప్రాంతానికి అందాల్సిన దేవాదుల నీరు అందకపోవడంతో రబీలో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి దేవాదుల నీరు వదిలి ఆయకట్టు చివరి వరకు సాగు నీరందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎకరానికి సుమారు రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. వేసవి కాలం ఆరంభంలోనే ఎండలు మండుతుండడంతో బావుల్లో నీరు అడుగంటి పోయి సాగునీరు ఎల్లని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు స్పందించి వెంటనే దేవాదుల కాలువ కింద ఉన్న గ్రామాలకు సాగు నీరందించి రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికే పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్, యాకూబ్, సాంబమూర్తి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరులో రక్తదాన శిబిరం విజయవంతం



శిబిరంలో పాల్గొన్న వారితో సొసైటీ సభ్యులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ప్రజా గ్రంథాలయం ఆవరణలో ఆదివారం రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్‌ఎస్ఎస్ పర్యవేక్షణలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతంగా ముగిసింది. యూత్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జక్కుల అనిల్ మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది పాల్గొన్నారు. వీరికి సొసైటీ తరఫున సర్టిఫికెట్స్, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ స్టాఫ్ డాక్టర్ కిషన్‌రావు, శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ సౌమ్య, చంద్రశేఖర్‌గుప్తా, శ్రీకాంత్, రమేష్, అనిల్, అరవింద్, మహేందర్, ప్రశాంత్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సాయం అందజేస్తున్న వైద్యులు, ఉద్యోగులు

పరకాల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైనాల కృష్ణకాంత్ కుటుంబానికి పరకాల సివిల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పరకాల సివిల్ ఆస్పత్రిలో 15 సంవత్సరాలుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న గోపి కుమారుడు కృష్ణకాంత్(లక్కీ) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ గౌతమ్ చౌహాన్, ఆర్ఎంఓ బాలకృష్ణతోపాటు వైద్యులు పరామర్శించారు. అనంతరం మృతుడు లక్కీ చిత్రపటానికి నివాళులర్పించి ఆర్థిక సాయం అందజేశారు.

ఐలోని మల్లన్నకు భక్తుల మొక్కులు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఐనవోలు: వారాంతపు జాతరలో భాగంగా ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం అంతా సందడి నెలకొంది. ఒగ్గు పూజారుల పూజలు, స్వామివారి గర్భాలయంలో అర్చనలు, అభిషేకాలతో సందడిగా మారింది. భక్తులు ఒగ్గు పూజారుల చేత పట్నాలు వేసి పితృదేవతలను పూజించారు. అదే విధంగా రేణుక అమ్మవారికి బోనం ప్రసాదం చేసి సమర్పించారు. కొందరు భక్తులు రథ సేవ చేశారు. మరి కొంత మంది భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదివారం ఆలయం అంతా భక్తుల తాకిడితో ప్రాంగణం అంతా కిక్కిరిసి పోయింది.

పూలే విగ్రహావిష్కరణ కమిటీ ఏర్పాటు



నూతన కమిటీ బాధ్యులు

ఆత్మకూరు: మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఆదివారం కమిటీని నియమించుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పిట్టల రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా పొనుగోటి సత్యనారాయణ, కోశాధికారిగా పంచనేని రాజు, గౌరవ అధ్యక్షుడిగా వంగేటి రాజమౌళి, అర్షం స్వామి, ఉపాధ్యక్షులుగా మానగాని సాంబమూర్తి, ఎన్నపురెడ్డి నాగరాజు, శోభన్, నీలం రాజు, న్యాతని ప్రవీణ్, ఎండీ.రఫీ, అర్షం సదానందం, ఓదెల సుధాకర్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఏప్రిల్ మాసంలో జరగనున్న మేధావుల జయంతి వేడుకలను ఘనంగా జరుపుతామన్నారు. ఏప్రిల్ 11న పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు.

ఎన్నిక



రవీందర్, అధ్యక్షుడు

ధర్మసాగర్: మండలంలోని తాటికాయల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాస్క రవీందర్, ఉపాధ్యక్షుడిగా నల్ల మొగిలి, ప్రధాన కార్యదర్శిగా పెసరు శివకృష్ణ, కోశాధికారిగా చెల్లోజు రాజు, యువజన విభాగం గ్రామ శాఖ అధ్యక్షుడిగా పట్ల మహేష్, కార్యదర్శిగా దువ్వల సుమన్, సహాయ కార్యదర్శిగా చెరుకు రమేష్, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా ఎండీ కమాలొద్దీన్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా బొల్లెపాక ప్రవీణ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెసరు రమేష్, ఎర్ర ప్రభాకర్, బొల్లెపాక కుమార్, కనకటి యాదగిరి, నల్ల అశోక్, తొట్టె సదయ్య తదితరులు పాల్గొన్నారు.

నియామకం



రమేష్, అధ్యక్షుడు

దామెర : ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పాముల రమేష్‌ను నియమించారు. తన నియామకానికి సహకరించిన ఎస్సీ వర్గీకరణ జేఏసీ రాష్ట్ర చైర్మన్ పులిగిల్ల బాలయ్య, రాష్ట్ర వైస్ చైర్మన్ నత్తి కొర్నేల్ కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడిగా మధుసూదన్



మధుసూదన్‌ను అభినందిస్తున్న నాయకులు

శాయంపేట : పద్మశాలీ కులసంఘం మండల అధ్యక్షుడిగా కొప్పుల గ్రామానికి చెందిన సామల మధుసూదన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి చందా మల్లయ్య ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ స్వర్గీయ రామా శ్రీనివాస్ ఆశయాలకు అనుగుణంగా పద్మశాలీ కులస్తుల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. శాయంపేట మండల కేంద్రంలో ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహ ఆవిష్కరణకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర సలహాదారుడు బాసాని చంద్రప్రకాశ్, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలి నాయకులు మధుసూదన్‌ను అభినందించారు. ఇదిలా ఉండగా.. మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో ఆదివారం ఎన్నికైన పద్మశాలి మండల కమిటీని శాయంపేట పద్మశాలీలు వ్యతిరేకిస్తున్నట్లు మండల పద్మశాలీ అధ్యక్ష పోటీలో ఉన్న వంగరి సాంబయ్య ప్రకటించారు. సాంబయ్య మాట్లాడుతూ మండల అధ్యక్షుడిగా మధుసూదన్‌ను పూర్తిగా ఏకపక్షంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. శాయంపేటలో అధిక సంఖ్యలో పద్మశాలీలు ఉన్నారని అయినప్పటికీ ఏకపక్షంగా వ్యవహరించారని తెలిపారు.

వర్గీకరణ ద్వారానే ఫలితాలు ప్రకటించాలి

- గంగారపు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న గంగారపు శ్రీనివాస్

ధర్మసాగర్: ఎస్సీ వర్గీకరణ ద్వారానే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 తోపాటు అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ఫలితాలను ప్రకటించాలని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతిసాగర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో మాదిగలు, ఎస్సీ వర్గీకరణ కోరే దళిత కులాల మీద మరో కుట్ర జరుగుతుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అతి త్వరలో పూర్తి చేయడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ప్రకటిస్తూనే.. మరోవైపు ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తికాకముందే ఈ నెల 10న గ్రూప్ 1, 11న గ్రూప్ 2, 14న గ్రూప్ 3, 17న హాస్టల్ వార్డెన్ ఆఫీసర్, ఈ నెల 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఫలితాలు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించడం సరికాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను మాలలకు కట్టబెట్టాలనే కుట్ర ప్రారంభమైందని అభిప్రాయపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తున్నట్లు మాదిగలను భ్రమలో పెడుతూనే మరో పక్క మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగ ప్రజలకు తీరని అన్యాయం చేయబోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సోంపెల్లి అన్వేష్, నాయకులు మాచర్ల బాబు, రాజు, బొడ్డు రమణాకర్, కొట్టె శంకర్, ప్రదీప్, ప్రణయ్, చైతన్య, స్వామి పాల్గొన్నారు.

వేలేరు: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత అయిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా మాదిగలకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయడానికి ఒకవైపు చర్యలు చేపడుతూనే మరోవైపు ఉద్యోగ నియామకాల ఫలితాలను ప్రకటిస్తామని చెప్పడం మాదిగలకు అన్యాయం చేయడమేనని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కనకం రాజయ్య, యేసు, ప్రచార కమిటీ కన్వీనర్ ఏలూరి వీరయ్య, బట్టు ప్రభాకర్, కొట్టె రత్నం, మొగిలి, శంకర్, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన 'అకుట్' బాధ్యులు

కేయూ క్యాంపస్: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (అకుట్) నూతన అధ్యక్షుడు ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎల్ పీ.రాజ్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. కాకతీయ యూనివర్సిటీలో అధ్యాపకుల పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు కృషి చేయాలని వారు కోరారు.

డంపింగ్ యార్డును తొలగించాలి

మడికొండ: మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుతో చుట్టుపక్కల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అడ్‌హక్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో అక్కడి నుంచి డంపింగ్ యార్డును తొలగించాలని కోరారు. రాంపూర్ గ్రామంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు డంపింగ్ యార్డు పొగతో అనారోగ్యానికి గురవుతున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేయాలి



డప్పులతో ప్రదర్శన చేస్తున్న కళాకారులు

దామెర : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ 123 కాకుండా ఏబీసీడీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో లక్ష డప్పులు వేయి గొంతుల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా మంద కృష్ణమాదిగ పోరాటం చేయడం ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. మందకృష్ణ మాదిగ తలపెట్టిన లక్ష డప్పులు వేయి గొంతుల కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి పెద్ద ఎత్తున మేధావులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు హైదరాబాద్‌కు తరలిరాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 9శాతం రిజర్వేషన్‌తో సరిపెట్టకుండా 11శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు వేల్పుల శ్రీను, నాయకులు కుమార్, చిరంజీవి, హరీష్, యాకూబ్, జైపాల్, రమేష్, శ్రీను, డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురిలో శ్రీనివాసుడి కల్యాణం

కాజీపేట: చైతన్యపురి కాలనీలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పద్మావతి, గోదాదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణ వేడుకలను వేద పండితులు కనులపండువగా నిర్వహించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వధూవరుల పక్షాన నిలిచి నూతన వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను డప్పు, వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి వేద పండితులకు అందజేశారు. పండితుల పర్యవేక్షణలో శ్రీమాన్ నారాయణుడి వివాహ తంతును పూజారులు జరిపించారు. పాలకమండలి సభ్యులు కన్యాదానం చేయించగా, ఆలయ ఆవరణలో ఎదుర్కోళ్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాదిమంది భక్తులు దేవతామూర్తులను దర్శించుకుని వివాహ వేడుకలను తిలకించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్ కుమార్ గౌడ్, నరేందర్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

జనావాసాల్లోని బెల్ట్‌షాపుల వద్ద గొడవలు



ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో ఎనీ టైమ్ మద్యం అన్నట్లుగా వీధికో బెల్ట్‌షాపు కొనసాగుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా 24 గంటలపాటు బెల్ట్‌షాపుల వద్ద మందుబాబులు క్యూ కడుతూ ఉంటారు. వారి న్యూసెన్స్ తట్టుకోలేక బెల్ట్‌షాపుల నిర్వాహకులతో స్థానికులు గొడవకు దిగుతున్నారు. ఎస్ఆర్ఆర్ తోటలోని ఆర్యవైశ్య శ్మశాన వాటిక వీధుల్లో కొనసాగుతున్న బెల్ట్‌షాపులను ఎక్సైజ్‌శాఖ అధికారులు తనిఖీ చేసి కేసులు నమోదు చేయలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. బెల్ట్‌షాపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోయారు. ఈమేరకు బెల్ట్‌షాపును మూసివేయాలని ఆదివారం సాయంత్రం ఆందోళనకు దిగారు.